క్లుప్తంగా

అభినందన



అమరావతి: వైఎస్సార్ సీపీ పెదకూరపాడు సీనియర్ నాయకుడు, సీఈసీ మెంబర్ వెంపా జ్వాలాలక్ష్మీనరసింహారావు(జాలయ్య)ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అభినందించారు. జాలయ్య గుంటూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శంకరరావును కలిశారు. తనను నియమించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలను జాలయ్య తెలిపారు.

మానసిక స్థైర్యంతో విజయకేతనం



నకరికల్లు: మానసిక స్థైర్యంతో సులువుగా విజయాలు సాధించవచ్చని మానసిక ఆరోగ్య కౌన్సిలర్ శాంతివర్ధన్ అన్నారు. అంతర్జాతీయ మానసిక వారోత్సవాల్లో భాగంగా స్థానిక కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలోని విద్యార్థినిలకు మానసిక ఆరోగ్యం, యోగాసనాల ప్రయోజనాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నచిన్న సమస్యలకు మానసిక స్థైర్యం కోల్పోకుండా మనోధైర్యంతో ముందుకు సాగాలన్నారు. మానసిక, శారీరక దృఢత్వం సాధించాలని సూచించారు. విద్యార్థినిలతో మానవహారం ఏర్పాటు చేశారు. ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, బాలల హక్కులపై అవగాహన

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సత్తెనపల్లి ఆధ్వర్యాన ఇరుకుపాలెం సెక్టార్ పరిధిలోని దమ్మాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలు, బాలల హక్కులపై మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. డీసీపీఓ యూనిట్ సోషల్ వర్కర్లు జి.జయరాజ్, ఎస్.నానమ్మ.. బాల్య వివాహాలతో ఎదురయ్యే అనర్థాలపై పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు క్రమబద్ధీకరణ



అచ్చంపేట: కోగంటివారిపాలెంలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు విద్యుత్ తీగలు తెగిపోయాయి. నాటి నుంచి గ్రామస్తులు విద్యుత్ శాఖాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారని ఈ నెల 5న 'తెగిన విద్యుత్ తీగలు వేసేదెప్పుడు?' శీర్షికతో 'సాక్షి' ప్రచురించిన కథనానికి విద్యుత్ ఏఈ శ్రీనివాసరెడ్డి స్పందించారు. మంగళవారం సర్పంచ్ బోనం నాగిరెడ్డి సమక్షంలో విద్యుత సిబ్బందితో యుద్ధప్రాతిపదికన గ్రామంలోని చింతలపాటి ప్రసాద్ ఇంటి నుంచి రాంభూపాల్‌రెడ్డి ఇంటి వరకు తెగిన విద్యుత్ తీగలను క్రమబద్ధీకరించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ తాను ఇటీవలే చార్జ్ తీసుకున్నానని, మిగిలిన మూడునాలుగు చోట్లకూడా విద్యుత్ తీగలు వేసి గ్రామంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా చూస్తానని చెప్పారు.

సాక్షి స్పందన

గుండెనొప్పితో టెక్నికల్ అసిస్టెంట్ మృతి



షేక్ ఖాదర్ బాషా

పెదకూరపాడు: గుండె నొప్పితో పెదకూరపాడు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్ షేక్ ఖాదర్ బాషా (47) మంగళవారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగేళ్లుగా పెదకూరపాడు మండలంలో ఎన్‌ఆర్‌జీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖాదర్ బాషా మధ్యాహ్న సమయంలో ఫీల్డ్ విజిట్ కి వెళుతూ ఛాతిలో నొప్పి రావడంతో బస్టాండ్ వద్ద ఆగి కూర్చొని ఉండగా ఒక్కసారిగా కుప్పకూలి కిందకు వరిగాడు. స్థానికులు గమనించి పెద్దకూరపాడు లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పరీక్షలు నిర్వహించి గుండెపోటుతో మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎన్‌ఆర్‌జీ ఎస్‌లో పని ఒత్తిడే గుండెపోటుకు కారణంగా పలువురు తెలుపుతున్నారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏపీడీ నారాయణ, పెదకూరపాడు మండల పరిషత్ ఏవో సోమయాజులు, తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఆర్టీసీ బస్సుల్లో 'ఉచిత' అవస్థలు

- పెరిగిన మహిళా ప్రయాణికులు
- అందుకు తగినట్లుగా పెంచని సర్వీసులు
- గంటల తరబడి ప్రయాణికుల పడిగాపులు

అచ్చంపేట: ఇటీవల ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులు అవస్థ పడుతున్నారు. ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్టు బస్సు సర్వీసులు తిరగకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సర్వీసులు అమలు చేస్తున్నామని కూటమి సర్కార్ గొప్పలు చెప్పుకుంటోంది. అయితే అమలులో ఉన్న లోపాలను, ప్రయాణికులు పడుతున్న అవస్థలను తెలిసి కూడా కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది.

ఎప్పటివో..

ప్రధానంగా సత్తెనపల్లి నుంచి అచ్చంపేట, మాదిపాడు, తాళ్లచెరువు తిరిగే బస్సులు మొత్తం కాలం చెల్లినవే. ఇవి ఎప్పుడో 1980, 2000 నాటి బస్సులు. ఉచిత బస్సు ప్రయాణం అమలులోకి రాగానే మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. బస్సులో 50 నుంచి 55 వరకు ఎక్కాల్సిన ప్రయాణికులు ఇప్పుడు 90 నుంచి 100 వరకు ఎక్కుతున్నారు.



కాలం చెల్లిన ఆర్టీసీ బస్సు

పెంచని సర్వీసులు.. సమస్యలు అధికం

ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్లుగా నూతన బస్సులు వేయడం గానీ, కనీసం సర్వీసుల సంఖ్యను పెంచడంగాని చేయకపోవడంతో భారీ లోడ్ బస్సులపై పడుతోంది. బస్సులు సకాలంలో రాకపోవడంతో గంటల కొద్దీ సమయాన్ని ప్రయాణికులు వెచ్చించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు సత్తెనపల్లి నుంచి అచ్చంపేటకు బస్సులు ఉండటంలేదు. 11 నుంచి 11.30 లోపు నాలుగు బస్సులు వరుసగా వస్తున్నాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అచ్చంపేట నుంచి సత్తెనపల్లికి బస్సులు ఉండటంలేదు. 2 గంటలకు వరుసగా నాలుగు బస్సులు వచ్చి పోతాయి. అయితే సత్తెనపల్లి నుంచి అచ్చంపేట, అచ్చంపేట నుంచి సత్తెనపల్లికి ప్రతి పావుగంటకు ఒక బస్సును తిప్పవచ్చు. మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడం, అందుకు తగినట్లుగా బస్సులు పెంచకపోవడం, ఉన్నా కాలం చెల్లిన బస్సులపై భారీ లోడ్‌పడి మధ్యలో ఆగిపోవడంతో ఆర్టీసీ వారు సకాలంలో బస్సులు నడపడంలో విఫలమయ్యారనే విమర్శలు వస్తున్నాయి.

ఉచిత ప్రయాణంలో ప్రధాన లోపాలు ఇవి

- కండక్టర్ ప్రతి ప్రయాణికురాలి వద్దకు వెళ్లి ఆధార్ చెక్‌చేసి టికెట్ కొట్టడంలో జాప్యమవుతోంది.
- ప్రయాణికుల సంఖ్య పెరగడంతో డోర్ పాయింట్‌లో మహిళా ప్రయాణికులు నిల్చుంటున్నారు. ప్రమాదం జరుగుతుందేమోనని కండక్టర్ ఆందోళన చెందడం.
- ముఖ్యంగా పురాతన బస్సులు కావడంతో గేర్లు, బ్రేకులు సక్రమంగా పడక డ్రైవరు నానా తిప్పలు పడటం.

బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేస్తే కఠిన చర్యలు

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): చాగంటివారిపాలెం గ్రామంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు చేయవద్దని, అలా చేసిన రైతులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.నగేష్ హెచ్చరించారు. మండలంలోని చాగంటివారిపాలెంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ నగేష్ మాట్లాడుతూ 2025-26 నుంచి రాష్ట్రంలో బ్లాక్‌బర్లీ పొగాకు సాగును నూరుశాతం నిషేధం చేయడానికి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీ.ఓ విడుదల చేసిందన్నారు. బ్లాక్‌బర్లీ పొగాకు నారు సాగును, నర్సరీలను నిషేధించటమైందన్నారు. ఒక వేళ సాగు చేసినా పంటను దున్ని తీసేస్తామన్నారు. వైట్ బర్లి పొగాకు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఆయా సంస్థల నుంచి అగ్రిమెంట్ల బాండ్లను పొందాల్సి ఉంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, పెసర, మినుము లేదా చిరుధాన్యాల సాగు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.శేషుబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు కె.పావని, రైతులు పాల్గొన్నారు.

క్రోసూరు: కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశాల మేరకు బ్లాక్ బర్లీ పొగాకు సాగును పూర్తిగా నిషేధించినట్లు, బ్లాక్ బర్లీ సాగు నియంత్రణకు జిల్లా డివిజన్, మండల స్థాయి టాస్క్‌ఫోర్సు కమిటీలను ఏర్పాటు చేసినట్లు మంగళవారం ఏవో వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. టాస్క్‌ఫోర్స్ కమిటీలో మండలస్థాయి చైర్మన్‌గా తహసీల్దార్, కన్వీనర్‌గా మండల వ్యవసాయధికారి, మెడికల్ ఆఫీసర్, అభ్యుదయ రైతు సభ్యులుగా ఉంటారన్నారు. కమిటీ పొగాకు నర్సరీలను, వ్యాపారులను, కంపెనీ ప్రతినిధులను, దళారులను, పొగాకు గోడౌన్లను, ప్రాసెసింగ్ యూనిట్లను తనిఖీలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఏవో, డెప్యూటీ తహసీల్దార్ జింకా శ్రీనివాసరావు, అభ్యుదయ రైతు తోక వెంకట్రావు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ

గ్రామాల పరిశుభ్రతే లక్ష్యం

సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. అప్పుడే క్లీన్ అండ్ గ్రీన్ యొక్క లక్ష్యాన్ని అందుకున్నట్లేనని చెప్పారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని సుప్రీం ఎల్‌టీసీలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలైన పరిశుభ్రత, పచ్చదనంపై మంగళవారం జిల్లాలోని 28 మండలాల నుంచి ఎంపిక చేసిన పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో జరిగే అన్ని కార్యక్రమాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని పిలుపునిచ్చారు. శిక్షణలో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ, పాలిథిన్ వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛ రథం, హరిత రాయబారుల హక్కులు, అవకాశాలపై అవగాహన కల్పించారు. నరసరావుపేట డీఎల్పీవో లక్ష్మణరావు, డీఆర్పీ నరసింహ నాయక్‌లు మాట్లాడారు. అనంతరం నందిగామ సుప్రీం లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో జరుగుతున్న కార్యక్రమాలను పంచాయతీ కార్యదర్శులు కుంభా వెంకటేశ్వర్లు, చిలుకూరి కృష్ణ ప్రసాద్ వివరించారు. శిక్షణకు మాస్టర్ ఆఫ్ ట్రైనర్లుగా బాపట్ల ఈటీసీ ఫ్యాకల్టీ సభ్యుడు రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు శివ కోటేశ్వరరావు, సదాశివ కుమారి వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లాలోని 28 మంది పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, డీఎల్పీవో లక్ష్మణరావు

ఎన్నికల హామీలను అమలు చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని

సత్తెనపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభాని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ఆధ్వర్యాన విజయవాడలో మంగళవారం తలపెట్టిన పోరుబాట ధర్నా కార్య క్రమానికి సత్తెనపల్లి నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున వెళ్లారు. ఈ సందర్భంగా ఎన్జీవో హోం సెంటర్‌లో ఎస్ఎం సుభాని మాట్లాడుతూ విద్యారంగ పరిరక్షణకు చేసే పోరాటాన్ని ప్రభుత్వం అర్థం చేసుకొని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే చెల్లించాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. అన్ని రకాల బకాయిలను వెంటనే చెల్లించాలని, యాప్‌ల భారంతో పాటు బోధనేతర పనులను ఎత్తివేయాలన్నారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. ఉద్యోగులు విధులకు సంబంధం లేని సర్వేలు, ఇతర పనుల నుంచి విముక్తి కలిగించాలన్నారు. శాఖలవారీగా మాతృ శాఖల్లో విలీనం చేయాలని, సచివాలయాల్లోని అన్ని విభాగాల ఉద్యోగులకు ఒకే బేసిక్‌తో పదోన్నతి కల్పిస్తూ పీఆర్సీ శ్లాబ్ వర్తింపజేయాలన్నారు. సెలవు రోజుల్లో బలవంతపు విధుల నుంచి విముక్తి కల్పించాలని, రికార్డు అసిస్టెంట్ క్యాడర్‌ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌గా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ప్రొబేషన్ కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వానికి చేదోడుగా ఉంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించ కుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాల స్ఫూర్తిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు ఉన్నారు.



ఎన్జీవో హోం సెంటర్‌లో మాట్లాడుతున్న సుభాని, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నేతలు

పెదకూరపాడులో వర్ష బీభత్సం



పెదకూరపాడు పొలంలో ఇలా..

- పెదకూరపాడులో కొట్టుకుపోయిన పాటిబండ్ల బ్రిడ్జి
- నీట మునిగిన పత్తి పంట

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలో సోమవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. రెండు గంటల పాటు కురిసిన వర్షాలకు వాగులు పొంగి పొర్లడంతో రాత్రి సమయంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెద్దకూరపాడు పేరమ్మ వాగు, నీరు కుంట, పాటిబండ్ల వాగు, 75 తాళ్లూరు లో లెవల్ వంతెన ప్రమాద స్థాయిలో పొంగాయి. పరస - ఖమ్మంపాడు గ్రామాల మధ్య వాగుల ఉధృతికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికులు అటువైపు వెళ్లకుండా రెవెన్యూ సిబ్బంది, పోలీసులు కాపలా ఉన్నారు. పాటిబండ్ల - పెదకూరపాడు మధ్య ఉన్న చిన్న బ్రిడ్జి గతంలో కురిసిన వర్షాలకు కుంగింది. రాత్రి పడిన వర్షంతో బ్రిడ్జి నీటిలో కొట్టుకుపోయింది. ఈ గ్రామాల మధ్య రవాణా పూర్తిగా నిలిచిపోయింది. పెదకూరపాడులో 99. 2 మి.మి. వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ ధనలక్ష్మి తెలిపారు. భారీ వర్షానికి మిర్చి మొక్కలు నేలకొరిగాయి. వాగు పరీవాహక పొలాలు పూర్తిగా నీట మునిగాయి.



నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన పాటిబండ్ల, పెద్దకూరపాడు మధ్య బ్రిడ్జి

సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించండి

సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్

సత్తెనపల్లి: భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ అన్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని (అమానవీయ సంఘటన)ను ముక్తకంఠంతో ఖండిస్తూ సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు న్యాయస్థానాల్లో ఉన్న న్యాయవాదులు విధులను బహిష్కరించి మంగళవారం తాలూకా న్యాయస్థానం గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఘటన న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చిన్నం మణిబాబు, న్యాయవాదులు రాజశేఖరుని గోపాలకృష్ణమూర్తి, సయ్యద్ అబ్దుల్ రహీం, దివ్వెల శ్రీనివాసరావు, నరిశేటి వేణుగోపాల్, జూపల్లి శేషయ్య, కొల్లా వెంకటేశ్వరరావు, కాకర్లనాగవెంకటహరిబాబు, బొక్క సంగీతరావు, జొన్నలగడ్డ విజయ్‌కుమార్, ఇ.ఏడుకొండలు, రాజవరపు నరసింహారావు గుర్రం పవన్, చవల బాల కోటయ్య, పాటిబండ్ల రవికుమార్, ఇ.మురళి తదితరులు ఉన్నారు.



న్యాయస్థానం ఎదుట న్యాయవాదుల నిరసన



నిరసనలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య

కుట్రలో భాగమే మతోన్మాదుల దాడి

భారత లౌకిక రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి సనాతన ధర్మం పేరుతో మను ధర్మశాస్త్రం రాజ్యాంగాన్ని ముందుకు తీసుకువచ్చే కుట్రలో భాగమే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై మతోన్మాదులు దాడి చేయడమని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యుడు గద్దె చలమయ్య అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం నిరసన సభ నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ మతోన్మాదుల కుట్రలకు వ్యతిరేకంగా, దుర్మార్గాలకు వ్యతిరేకంగా దేశ ప్రజానీకం అంతా ఉద్యమిస్తున్నారన్నారు. దీన్ని సహించలేని సంఘపరివార్ శక్తులు ఇలాంటి భౌతిక దాడులకు దిగుతున్నారన్నారు. అత్యున్నత న్యాయస్థానంలోని న్యాయమూర్తికి ఆర్ఎస్ఎస్ కార్యకర్త, సనాతన ధర్మవాది అయిన న్యాయవాది రాకేష్ కిషోర్ ఒక్కసారిగా బూట్ తీసి న్యాయమూర్తి గవాయ్ పై విసరడం చాలా దుర్మార్గమన్నారు. దీన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందని, ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని ఆయన కోరారు. నిరసనలో భాగంగా ప్లకార్డులను ప్రదర్శించారు. చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మన్నూరు భాస్కరయ్య, సీపీఎం పట్టణ కార్యదర్శి డి విమల, నాయకులు గద్దె ఉమాశ్రీ,ఎం హరిపోతురాజు, జె రాజ్‌కుమార్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర్తి రాజు, కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, నాయకులు కట్టా శివదుర్గారావు, అనుముల వీర బ్రహ్మం, వృత్తిదారుల సంఘం నాయకులు వెంకటరావు, నందం చంద్రకళ పాల్గొన్నారు.

క్రీడలతో ఉద్యోగ అవకాశాలు

నరసరావుపేట రూరల్: క్రీడాకారులకు విద్యతో పాటు ఉద్యోగాల్లోను ప్రభుత్వాలు రిజర్వేషన్ కల్పిస్తున్నాయని డిప్యూటీ డీఈవో సుభాని తెలిపారు. 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీల్లో భాగంగా మండల స్థాయి పోటీలను మంగళవారం శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీల ప్రారంభ కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సుభాని, ఎంఈవో నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పార్వతి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, మహిళా కార్యదర్శి డాక్టర్ ఉన్నం పద్మావతిలు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాని మాట్లాడుతూ క్రీడలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇస్తున్నాయని, వివిధ స్థాయిల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆటల్లో ప్రావీణ్యం చూపాలన్నారు.

డెయిరీ పార్లర్లలో చోరీకి యత్నం

సత్తెనపల్లి: పట్టణంలోని రెండు సంగం డెయిరీ పార్లర్లలో గుర్తు తెలియని దుండగుడు చోరీకి మంగళవారం యత్నించాడు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలోని జొన్నవరపు శ్రీనివాసరెడ్డికి చెందిన సంగం డెయిరీ పార్లర్లలో గుర్తు తెలియని దుండగుడు ప్రవేశించి రూ. 10వేలు విలువ చేసే సిగరెట్లు, రూ. 5 వేల నగదు కాజేశాడు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ ఎదురు మౌర్య హోటల్ పక్కన గల నాగుర్‌వలి సంగం డెయిరీ పార్లర్లలో చోరీకి ప్రయత్నించినా ఫలించలేదు.

నేడు, రేపు మండల స్థాయి క్రీడలు, ఎంపికలు

నకరికల్లు: మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, అండర్-17 బాలబాలికలకు మంగళవారం నిర్వహించాల్సిన సెలక్షన్స్, క్రీడా పోటీలు వర్షకారణంగా ఈనెల 8, 9 తేదీలకు వాయిదా వేసినట్లు ఫిజికల్ డైరెక్టర్ జి.ఝాన్సీరాణి మంగళవారం తెలిపారు. ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బ్యాడ్మింటన్, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని వివరించారు.

యువతితో అసభ్యకర ప్రవర్తన

సత్తెనపల్లి: యువతితో ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని లక్ష్మీ టాకీస్ సమీపంలో మంగళవారం జరిగింది. సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు చెందిన గోపి అనే వ్యక్తి ఓ యువతితో అసభ్యకరంగా ప్రవర్తించి రూ. 10 వేలు కావాలా అంటూ అసభ్యకరంగా మాట్లాడాడు. అది గ్రహించిన కొందరు గోపికి స్వల్పంగా దేహశుద్ధి చేసినట్లు తెలుస్తోంది.

జెడ్పీ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంకొండ: జెడ్పీ పాఠశాలలో సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాల లోతట్టు ప్రాంతంలో ఉండటంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచిపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాలలో నీరు నిలిచిపోకుండా ఉండేందుకు, మైదానం అభివృద్ధికి, పాఠశాలలో మరమ్మతులకు జిల్లా పరిషత్ నుంచి రూ. 36 లక్షల నిధులను కేటాయించినట్లు తెలిపారు. మైదానంలో నిలిచిపోయిన వర్షంనీటిని తూముల ద్వారా బయటకు పంపించారు. పాఠశాల ప్రహరీ చుట్టూ డ్రైనేజీలను నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈ వేణు నాయక్, ఎంపీడీవో సునీత, ఎంఈఓ బాలసుందరరావు, పీఆర్ డీఈ వాణినాథ్, ఏ శ్రీనివాసరెడ్డి, నేతలు పీఎస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ జ్యోతి సముద్రం పాల్గొన్నారు.



బెల్లంకొండ జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ, సిబ్బంది

సన్మార్గాన్ని నిర్దేశించిన వాల్మీకి

సత్తెనపల్లి: రామాయణాన్ని మధుర కావ్యంగా మలచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 12వ వార్డు వాల్మీకినగర్‌లో వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద మంగళ వారం ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత వాల్మీకి మహర్షి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నాయకుడు ఎద్దులదొడ్డి శ్రీనివాసరావు, నేతలు యెల్లినేడి రామ స్వామి, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

రాజుపాలెం: సీజనల్ వ్యాధులపై ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రవితేజనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క ఆశ కార్యకర్త వారివారి గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలోనే కాన్పులు జరగడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో బాలింతలను ఆశ, ఆరోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

రాజుపాలెం: ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు నోటీసులు అందించారు. మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపుల ఆక్రమించుకున్న ఆక్రమణదారులకు గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి హర్షికప్రియదర్శిని మంగళవారం నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వారంలో ఆక్రమణదారులు ఖాళీ చేయాలని, లేనిపక్షంలో దగ్గరుండి ఖాళీ చేయిస్తామని హెచ్చరించారు.